క్లుప్తంగా

ఆత్మకూరు డివిజన్‌లో 123 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో గడిచిన 24 గంటల్లో సోమవారం ఉదయం నాటికి 123 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా ఉదయగిరి మండలంలో 54.2 మి.మీ., సీతారామపురంలో 41.8, మర్రిపాడులో 5.8, అనంతసాగరంలో 6.2, కలువాయిలో 7.2, ఆత్మకూరులో 6.8, చేజర్లలో 1 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు వివరించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్

అల్లూరు: అల్లూరు తహసీల్దారుగా కె.చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విడవలూరు తహసీల్దారుగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అల్లూరు తహసీల్దారుగా పని చేసిన డి శ్రీరామకృష్ణ కలిగిరికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఆర్టీసీ బస్సులో పొగలు

సంగం: నెల్లూరు–బద్వేల్ ఆర్టీసీ బస్సులో అకస్మాత్తుగా పొగలు రావడంతో బస్సును నిలిపివేసిన ఘటన సోమవారం సంగం వద్ద జరిగింది. నెల్లూరు నుంచి బద్వేల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సంగం గురుకుల పాఠశాల వద్దకు వచ్చే సరికి పొగలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ చాకచక్యంగా వెంటనే బస్సును నిలిపివేసి ప్రయాణికులను కిందిదించేశాడు. డ్రైవర్ అప్రమత్తతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్సులో ఉన్న 55 మంది ప్రయాణికులను ఆర్టీసీ సిబ్బంది సురక్షితంగా మరో ఆర్టీసీ బస్సులో తరలించారు.

గోశాల నిర్మాణానికి విరాళం


ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దాతలు

అల్లూరు: మండలంలోని వెలిచర్లలో నిర్మిస్తున్న గోశాల నిర్మాణానికి కేఎస్ఆర్ ఫౌండేషన్ యోగా సెంటర్ యోగసాధకుల ఆధ్వర్యంలో రూ.43,529 విరాళాన్ని గోశాల నిర్వాహకుడు శ్రీనివాసులకు అందజేశారు. గోశాలకు తమవంతు సహాయ సహకారాలను అందజేశామని తెలియజేశారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను చేయడానికి తాము ఎల్లప్పుడు ముందుటామని తెలియజేస్తున్నామన్నారు. విశాంత్ర ఉపాధ్యాయులు కొప్పు శ్రీనివాసులు బ్రహ్మానందం, హరీష్, హరనాథ్, మల్లికార్జున, కత్తుల శ్రీకాంత్, పరిశినేటి కల్యాణ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి: ఉదయగిరి మండలం కృష్ణంపల్లికి చెందిన షేక్ దస్తగిరి నాలుగు నెలలుగా కనిపించడం లేదని ఆయన భార్య మెమోల సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి పని మీద బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహార సరుకుల పంపిణీ



కలిగిరి: కలిగిరి పీహెచ్‌సీలో టీబీ వ్యాధిగ్రస్తులకు వైద్యాధికారిణి గీతారెడ్డి సోమవారం పౌష్టికాహార సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవాలనే ఉద్దేశంతో రాగిపిండి, నూనె, పచ్చిశనగలు, కందిపప్పు, శనగబేడలు, గోధుమ పిండి, ఎండు ద్రాక్ష, ఎండు ఖర్జూరం, బాదం పప్పు వంటి 9 రకాల పౌష్టికాహార పదార్థాలను అందిస్తున్నామన్నారు. సీహెచ్ఓ సాయిలక్ష్మి, ఎంపీహెచ్ఎస్ నరసయ్య, సిబ్బంది శివ, షబ్బీర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

తెల్లరాయి తవ్వకాలు

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం బొమ్మవరం చెరువులో తెల్లరాయి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి గ్రామస్తులు అడ్డుకోవడంతో కొందరు వెనుతిరిగారు. సంబంధిత అధికారులకు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంకు చెందిన బిల్లుపాటి వెంకటేశ్వర్లు తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో సోమవారం జీఎంకే ట్రస్ట్ అధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్య, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, మరో దాత బొందికాల సుధాకర్, తదితరులు కలిపి రూ.46 వేలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు.

జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేదు

- టీడీపీ, జనసేనకు పొత్తులపై తప్ప ప్రజలపై ధ్యాస లేదు
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీకే ప్రజల మద్దతు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకేనని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో సోమవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుంచి అమలు చేసిన పథకాలను వివరించడంతో పాటు ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా విజయం మాత్రం వైఎస్సార్‌సీపీదేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో ప్రజలంతా తమ జగనన్నే మా నమ్మకం నినాదాన్ని వినిపించడమే ఇందుకు నిదర్శనమన్నారు. పాలనలో తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొలేక టీడీపీ, జనసేన పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయని ఎద్దేవా చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడికి పవన్‌కల్యాణ్‌కి ముఖ్యమంత్రి పీఠంపై ఆశ తప్ప ఎన్నికల్లో పోటీ చేసి జగన్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం మాత్రం లేవన్నారు. సింహం లాంటి జగన్‌ను ఎదుర్కొనే సత్తా తోడేళ్ల గుంపు వంటి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు లేవని స్పష్టం చేశారు. చివరకు పవన్‌కల్యాణ్ ప్యాకేజీకే పరిమితమవ్వక తప్పదని జోస్యం చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నిరుపేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మన స్ఫూర్తిగా విశ్వసిస్తున్నారని తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా పేదల ఇళ్లకు వెళ్లినప్పుడు సంక్షేమ పథకాల ద్వారా వాళ్లకు అందిన లబ్ధిని సంతోషంగా చెబుతున్నారని తెలిపారు. 'జగనన్న మా బిడ్డలను చదివిస్తున్నాడు.. మాకు ఆసరా ఇచ్చాడు.. చేయూతగా నిలిచాడు' అని అక్కచెల్లెమ్మలు చెబుతున్న మాటలు, పింఛన్ అందుకుంటున్న అవ్వతాతల్లో కనిపిస్తున్న సంతోషం ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిరూపిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అలఘునాథుడి కల్యాణం


అలఘునాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని పురాతన ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలు సోమవారం కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వేకువజామునే స్వామివార్ల మూల విరాట్టులకు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. అనంతరం కలశ స్థాపన చేశారు. నవగ్రహాలను, పలువురు దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను వేయించేపు చేసి శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి కల్యాణాన్ని టీటీడీకి చెందిన అర్చకులతో కల్యాణ ఘట్టాలను వివరిస్తూ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు.

నేడు గజ వాహనోత్సవం

మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి, అలఘునాథస్వామిలను గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మహిళలతో కోలాట భజనలు, బ్రాహ్మణపల్లికి చెందిన బాలికల బృందం నృత్య కోలాటం, డీజే సంగీతంతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేత్ర పర్వం సీతారాముల కల్యాణం


వైభవంగా జరుగుతున్న సీతారాముల కల్యాణం

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం ఎగువపల్లిలోని సీతారాముల మందిరంలో సోమవారం అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం జరిగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక పైకి స్వామి అమ్మవార్లను కొలువుదీర్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా కన్యాదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని శుభ ముహూర్తంలో నిర్వహించారు. భక్తులు శ్రీరామ స్మరణ చేస్తూ కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా బ్రహ్మంగారి గ్రామోత్సవం


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

కొండాపురం: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన సందర్భంగా మండలంలోని కొమ్మిలో ఆదివారం రాత్రి ఘనంగా బ్రహ్మంగారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామి విగ్రహాలను కూరగాయలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మఠం ధర్మకర్త కంచర్ల కేశవాచారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆరాధన సందర్భంగా వేడుకలను నిర్వహిస్తామన్నారు. మేళతాళాలు, డప్పులు, కోలాట భజనలతో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా పనిచేద్దాం

- సీడీపీఓ జైనకుమారి



మాట్లాడుతున్న సీడీపీఓ జైనకుమారి

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా కోట్లాది రూపాయలు నిధులు కేటాయిస్తున్నాయని ఆ లక్ష్యం నెరవేరేలా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలని ఆత్మకూరు ఐసీడీఎస్ సెక్టార్ సీడీపీఓ జైనకుమారి అన్నారు. రీ ఆర్గనైజేషన్ ప్రక్రియలో భాగంగా ఆత్మకూరు ప్రాజెక్ట్‌లో చేజర్ల, సంగం అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేశారు. దీంతో ఆ మండలాల అంగన్‌వాడీ సిబ్బందితో సోమవారం సీడీపీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఆత్మకూరులోని అనంతసాగరం మండలాన్ని మర్రిపాడు మండలాన్ని కలిపి ప్రత్యేక సీడీపీఓను ఏర్పాటు చేశారన్నారు. నూతనంగా ఆత్మకూరు సెక్టార్‌లో చేరిన సంగం, చేజర్ల మండలాల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు ఇక నుంచి ఆత్మకూరులో జరిగే సమావేశాలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. గతంలో 216 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా రీఆర్గనైజేషన్ ప్రక్రియతో ఆ రెండు మండలాలు చేరడంతో 255 అంగన్‌వాడీ కేంద్రాలు ఆత్మకూరు సెక్టార్ పరిధిలో ఉన్నట్లు ఆమె తెలిపారు. బుచ్చి, పొదలకూరు సెక్టార్లను రద్దు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులకు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని నిబంధనల మేరకు సరఫరా చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీఓ సునీలత, సూపర్‌వైజర్లు నారాయణమ్మ, రత్నమ్మ, జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు, సహాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలింపు

బిట్రగుంట: బోగోలు ముస్లిం బజార్‌లో జనవాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాన్ని దూరంగా తరలించారు. మద్యం దుకాణంగా కారణంగా స్థానికంగా ఉన్న ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యను వైఎస్సార్‌సీపీ నేత మద్దిబోయిన వీరరఘుతో కలిసి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి వివరించారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే చర్యలు చేపట్టారు. మద్యం దుకాణాన్ని తొలిగించడంపై స్థానిక ముస్లింలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కోలాహలంగా సీతారాముల పారువేట



ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం డీసీపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల పారువేట కోలాహలంగా నిర్వహించారు. బాణాసంచా సందడి, డీజే మ్యూజికల్ డ్యాన్స్‌లతో యువకులు హోరెత్తించారు. గ్రామానికి చెందిన దాతలు భక్తులకు అన్న ప్రసాదం, పానకం వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

సివిల్ రైట్స్ డే


ఎస్టీ కాలనీలోని సమస్యలపై చర్చిస్తున్న అధికారులు

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడు ఎస్టీ కాలనీలో సోమవారం సివిల్ రైట్స్ డే, కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై అధికారులు చర్చించారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్య, శ్మశాన వాటికకు దారి విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. తహసీల్దార్ శివకృష్ణయ్య, ఆర్ఐ సుమతి, గ్రామ నాయకులు జయంతుల్ నాయుడు, జయరామనాయుడు పాల్గొన్నారు.

సెబ్ కార్యాలయం కోసం స్థల పరిశీలన

ఉదయగిరి: ఉదయగిరి సెబ్ స్టేషన్‌కు ఆవాస భవన సముదాయానికి అవసరమైన స్థలాన్ని సోమవారం రెవెన్యూ, సెబ్ అధికారులు కలిసి పరిశీలించారు. సీతారామపురం, బండగానిపల్లి, గంగిరెడ్డిపల్లి మార్గాల్లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సెబ్ ఎస్సై మురళీకృష్ణ, సర్వేయర్లు రవి, మీరావలి, వీఆర్వో వెంకట్ ఉన్నారు.

80.38 శాతం పింఛన్ల పంపిణీ


మహిమలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్, పీఎస్ భాస్కర్

ఆత్మకూరురూరల్: ప్రతి నెలా ప్రభుత్వం వివిధ వర్గాల వారికి అందజేస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ తొలి రోజు సోమవారం మండలంలో 80.38 శాతం పూర్తయిందని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. తొలిరోజు పింఛన్ల పంపిణీ పూర్తయిందని, మిగిలిన వారికి నూరు శాతం పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

దుత్తలూరు: దుత్తలూరు మండల సోషల్ మీడియా కో–కన్వీనరు షేక్ ఖాదర్‌బాషా ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడడంతో సోమవారం కలిగిరి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఏరుకొల్లులోని ఖాదర్ బాషా ఇంటికి పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. త్వరగా కోలుకొని మంచి ఆరోగ్యం పొందాలని ఆయన ఆకాంక్షించారు.

క్షతగాత్రురాలికి ఆర్థిక సాయం

ఉదయగిరి: మండంలోని నేలటూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికురాలు రవణమ్మ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన నేపథ్యంలో సీఐటీయూ మండల నేతలు ఆమెకు సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మండల సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఉస్మాన్‌వలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది సస్పెన్షన్

ఆత్మకూరు: తాగునీటి సరఫరా చేసే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు మున్సిపల్ సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జే ప్రసాద్ సోమవారం రాత్రి తెలిపారు. మున్సిపల్ పరిధిలో తాగునీటి సరఫరా చేసేందుకు బట్టేపాడు మార్గంలో ఉన్న ఈ కేంద్రంలో తాగునీటి సరఫరా సమయంలో ఆలం (శుద్ధపటిక) నిర్దిష్ట ప్రమాణాల మేరకు కలపాల్సి ఉంటుంది. నాలుగు రోజులుగా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితంగా రావడం తెలిసిందే.

నేటి నుంచి లోకోస్ యాప్‌పై శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో లోకోస్ యాప్‌పై సీసీలకు శిక్షణ నిర్వహించనున్నట్లు ఏపీఎం బి.వెంకమ్మ సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి 5వ తేదీ వరకు ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట

కావలి: కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు, అనధికారిక లావాదేవీలకు అడ్డుకట్ట వేసే దిశగా కఠిన చర్యలు చేపడుతున్నట్లు కావలి సబ్‌రిజిస్ట్రార్ కొల్లి రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులను, రిజిస్ట్రేషన్‌శాఖను తప్పుదోవ పట్టించేలా నకిలీ డాక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్లకు, అవకతవకలకు పాల్పడే దళారులు, ప్రైవేట్ వ్యక్తులతో పాటు వారిని ఆశ్రయించిన వారిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. రిజిస్ట్రేషన్లు, ఇతర డాక్యుమెంట్లకు సంబంధించి ఎటువంటి వివరాలు అవసరమైనా కార్యాలయంలోని ఫెసిలిటేషన్ డెస్క్‌ను లేదా నేరుగా సబ్‌రిజిస్ట్రార్‌ను సంప్రదించాలని సూచించారు. దళారులు, ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేయిస్తామని నగదు డిమాండ్ చేసినా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

నిబద్ధతతో సేవలు అందిస్తా


మాట్లాడుతున్న సోమల మాధవ రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): రైతులకు నిబద్ధతతో సేవలు అందిస్తానని భీమవరం సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి తెలిపారు. సోమవారం మర్రిపాడులో జరిగిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. తొలుత మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సొసైటీ కార్యాలయం వరకు బాణాసంచా మోతలతో కార్యకర్తల నినాదాల నడుమ సొసైటీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మాధవరెడ్డి మాట్లాడుతూ భీమవరం సొసైటీ చైర్మన్‌గా తన నియామకానికి ఆమోదం తెలిపిన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆశీస్సులతో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సొసైటీ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ భీమవరం సొసైటీ రూ.3 కోట్ల టర్నోవర్‌లో రైతులకు వివిధ రకాల సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులకు అందించేందుకు సొసైటీ చైర్మన్ మాధవరెడ్డి సూచనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు నూతన చైర్మన్‌ని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. మర్రిపాడు ఎంపీపీ గంగవరపు లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, ఏపిలగుంట ఎంపీటీసీ నాయుడు హజరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముటుకుందు లక్ష్మీరెడ్డి, గోపవరం కాంతారెడ్డి, నాయకులు చింతంరెడ్డి జంగంరెడ్డి, గువ్వల వెంగళరెడ్డి, ఒంగోలు శ్రీనివాసులురెడ్డి, గంగినేని బాబు, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, చెవుల శ్రీనివాసులు, శివకుమార్ రాజు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పరిష్కారానికి ప్రాధాన్యం

- ఆర్డీఓ సాధు కరుణకుమారి


అర్జీదారునితో మాట్లాడుతున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరు: ఆర్డీఓ కార్యాలయంతో పాటు డివిజన్‌లోని రెవెన్యూ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమంలో అందే అర్జీల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పలు మండలాల నుంచి బాధితులు అర్జీలను అందజేశారు. ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలోని ఇంటి నివేశన స్థలం వివాదాన్ని సిబ్బందితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. అనంతసాగరం మండలం రేవూరులో ఓ భూ వివాదంపై తహసీల్దార్‌తో మాట్లాడి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఆర్డీఓ కరుణకుమారి మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను అక్కడే పరిష్కరించాలని, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యేవాటిని తమకు పంపాలని మండలాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే చుక్కల భూముల సమస్యల 90 శాతం పరిష్కారానికి నోచుకుందని తెలిపారు. స్పందనలో 9 అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ సంధ్య, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కోలాహలంగా మేడే వేడుకలు


ఎల్ఆర్‌పల్లిలో జెండా ఆవిష్కరణ చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు


పాతబస్టాండ్ సెంటర్‌లో మేడే వేడుకల్లో ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు

ఆత్మకూరు: ప్రపంచ కార్మిక దినోత్సవం 'మేడే'ను పలు కార్మిక సంఘాలు, సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం నాయకులు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరణ చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. సీపీఎం నాయకులు డేవిడ్ రాజు, షేక్ సందానీ, ఎ.నాగయ్య, నాగేంద్ర, మహిళా నాయకులు గుల్జార్‌బేగం, పద్మజ, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, హజరత్తయ్య, సీపీఐ నాయకులు మునీర్‌బాబు, శేషాద్రి, నాగరాజు, హజరత్తయ్య, గద్దర్‌బాబు, యూటీఎఫ్ నాయకులు శివకుమార్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో గ్యారేజీలో

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో మేడే వేడుకలను సోమవారం ఎంప్లాయీస్ యూనియన్, ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్లు ఘనంగా నిర్వహించారు. అరుణపతాకాన్ని ఎగురవేశారు. ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి తిరుమలరెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు మహమ్మద్ ఆలీ, పద్మారావు, హయత్ బాషా పాల్గొన్నారు.

సంగం: సంగంలో సోమవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మేడే సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు సీఐటియు జెండాను ఆవిష్కరించారు.

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. నాయకులు మీరా మొహిద్దీన్ రహంతుల్లా సుబ్బరాయుడు, అన్వర్‌బాషా మస్తాన్, జకరయ్య, సంధాని, హరి, రఫీ, ఆశిక్, వసీం పాల్గొన్నారు.

దుత్తలూరు: దుత్తలూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు డి.ఓబుల్‌రెడ్డి, మండల కార్యదర్శి ఎస్.సింహాద్రి, సీపీఎం మండల గౌరవాధ్యక్షుడు గుజ్జుల మల్లికార్జున, ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకుడు సింగవరపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో సోమవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం, సీఐటీయూ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. సీఐటీయూ నాయకులు ఎం.భాస్కర్‌రెడ్డి, బయ్యన్న, యూటీఎఫ్ నాయకులు జి.చెంచలబాబు, మోహన్‌రెడ్డి, చెంచయ్య, కామాక్షయ్య కార్మికులు పాల్గొన్నారు.

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక, జలదంకి గ్రామాల్లో సోమవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణక్రాకలో సీపీఎం నాయకుడు గడ్డం మాల్యాద్రిరెడ్డి ఆధ్వర్యంలో, జలదంకి వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మాల్యాద్రి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్మికులతో జెండాను ఎగురవేశారు. విజయమ్మ, మస్తాన్, బాలయ్య, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: కొండాపురం ఆటో యూనియన్ కార్మికులు మేడే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు బిల్లా కృష్ణ, టి. కొండలరావు, అంకబాబు, నజీర్ పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలో సోమవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో భవన నిర్మాణ కార్మికుడు నాగరాజు, ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో బండగానిపల్లి ఎంపీటీసీ విజయమ్మ జెండాలు ఎగురవేశారు. స్థానిక సీపీయం కార్యాలయం, ఆర్టీసీ డిపో, విద్యుత్ కార్యాలయాల వద్ద జెండాలు ఎగురవేశారు. కాకు వెంకటయ్య, మస్తాన్, ఫర్దిన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.